

కోహీర్ : లాలకుంటలో ప్రచారం చేస్తున్న మాణిక్‌రావు సతీమణి మధులత



కోహీర్ : మధులత, ఎంపీటీసీ అనిత సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న యువకులు

# కాంగ్రెస్‌ను నమ్మొద్దు

- వికారాబాద్‌లో గెలవలేని చంద్రశేఖర్.. జహీరాబాద్ నియోజకవర్గంలో గెలుస్తాడా?
- 50 ఏండ్లు చేయనివాళ్లు.. ఇప్పుడు చేస్తారా?
- బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి, సంక్షేమం
- బీఆర్‌ఎస్ అభ్యర్థి కొనింటి మాణిక్‌రావు
- ముమ్మరంగా గులాబీ సైనికుల ప్రచారం



జహీరాబాద్ : హుగ్గెల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మాణిక్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు

జహీరాబాద్/ కోహీర్, నవంబర్ 13 : ఎన్నికల ప్రచారంలో ప్రజలు బీఆర్‌ఎస్‌కు బ్రహ్మరథం పడుతున్నారు. జహీరాబాద్ మండలంలోని హుగ్గెల్లి, రాయిపల్లి(డీ) గ్రామాల్లో సోమవారం బీఆర్‌ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా మాణిక్‌రావు మాట్లాడుతూ.. వికారాబాద్‌లో గెలవలేని చంద్రశేఖర్ జహీరాబాద్‌లో గెలుస్తాడా ? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఒక్క ఛాన్స్ ఇవ్వండి అంటూ వేడుకుంటున్నది... కానీ, 50 ఏండ్లు రాష్ట్రాన్ని పరిపాలించి, ఏమీ చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ పంచాయతీ ఢిల్లీలో ఉంటుంది, వారు మనకు అవసరమా? అని ప్రజలకు సూచించారు. బీఆర్‌ఎస్ హయాంలోనే జహీరాబాద్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. సీఎం కేసీఆర్ సహకారంలో కోట్లాది రూపాయల వ్యయంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు మాణిక్‌రావు వివరించారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు పంపిణీ చేశామన్నారు. హుగ్గెల్లి, రాయిపల్లి(డీ) గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామన్నారు. ప్రజా సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎన్నో పథకాలను అమలు చేశారని తెలిపారు. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓట్లు వేసి ఆశీర్వదించాలన్నారు. జహీరాబాద్ బిడ్డగా ఓట్లు వేసి ఆశీర్వదించాలని కోరారు. స్థానికేతరులు పోటీ చేస్తున్నారని, వారితో జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రచారంలో జహీరాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండప్ప, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు తట్టు నారాయణ, హుగ్గెల్లి ఎంపీటీసీ రాములు, నాయకులు ఏసురత్నం, దత్తరెడ్డి పాల్గొన్నారు.



కోహీర్ : కవేలి గ్రామంలో బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం

## ప్రతి ఒక్కరూ కష్టపడాలి

మాణిక్‌రావు విజయం కోసం కార్యకర్తలు సైనికుల్లా కష్టపడాలని బీఆర్‌ఎస్ కోహీర్ మండలాధ్యక్షుడు నర్సింహులు పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి కవేలి గ్రామంలో బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సీఎం కేసీఆర్ రూపొందించిన మ్యానిఫెస్టోతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరించాలని సూచించారు. సమావేశంలో మాజీ సర్పంచ్‌లు మొగులయ్య, యాదవరెడ్డి, నేతలు అత్తార్, సంగన్న, బషీర్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సతీమణి ప్రచారం

కోహీర్ పట్టణం లాలకుంట కాలనీలో ఆదివారం రాత్రి ఎమ్మెల్యే మాణిక్‌రావు సతీమణి మధులత ఇంటింటి ప్రచారం చేశారు. ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ అనిత సమక్షంలో యువకులు బీఆర్‌ఎస్‌లో చేరారు.



జహీరాబాద్ : హుగ్గెల్లి గ్రామంలో మాణిక్‌రావును సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు



జహీరాబాద్ : హుగ్గెల్లి దర్గాలో ప్రార్థన చేస్తున్న మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్

# నామినేషన్ల పరిశీలన పూర్తి

- రెండు తిరస్కరణ
- 28 నామినేషన్లకు ఆమోదం



నామినేషన్ పత్రాలను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారులు

జహీరాబాద్, నవంబర్ 13 : జహీరాబాద్ ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్ పత్రాల పరిశీలన పూర్తయింది. ఎన్నికల్లో పోటీ చేయడానికి అభ్యర్థులు వేసిన నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులు పరిశీలించి, ఆమోదముద్ర వేశారు. ఇద్దరి అభ్యర్థుల నామినేషన్ పత్రాలను తిరస్కరించినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. సోమవారం నామినేషన్ పత్రాలను పరిశీలించగా, స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన బ్యాగరి సిద్ధన్న, ఆగమ ప్రేమీల సరైన పత్రాలు సమర్పించకపోవడంతో తిరస్కరించినట్లు తెలిపారు. 30 మంది నామినేషన్ దాఖలు చేయగా, ఇద్దరి నామినేషన్ పత్రాలను తిరస్కరించామని, 28 మంది అభ్యర్థుల నామినేషన్ పత్రాలను ఆమోదించినట్లు అధికారులు వివరించారు.

# భారీ భద్రత ఏర్పాట్లు చేయాలి

- ఎన్నికల స్ట్రాంగ్ రూంలను పరిశీలించిన జిల్లా ఎన్నికల పరిశీలకుడు పవన్‌కుమార్



జహీరాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు పవన్‌కుమార్

జహీరాబాద్, నవంబర్ 13 : ఎన్నికల కమిషన్ నిబంధనలను ప్రతిఒక్కరూ అమలు చేయాలని, స్ట్రాంగ్ రూం వద్ద భారీ భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల పరిశీలకుడు పవన్‌కుమార్ తెలిపారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. స్ట్రాంగ్‌రూం వద్ద 24 గంటల ప్రత్యేక భద్రతా ఏర్పాటు చేసి, పర్యవేక్షించాలన్నారు. అనుమతి లేనిది ఎవరికీ అనుమతి ఇవ్వొద్దు అన్నారు. శాసనసభ ఎన్నికల ఏర్పాట్లుపై ఎన్నిల రిటర్నింగ్ అధికారి వెంకారెడ్డి, డీఎస్పీ రఘుకు పలు సూచనలు చేశారు. ఎన్నికల పరిశీలకుల వెంటనే సీఐ రాజు, అధికారులు ఉన్నారు.

# నేటినుంచి కార్తీక రుద్రాభిషేకం

న్యాల్‌కల్, నవంబర్ 13 : మండలంలోని హద్నూర్ గ్రామంలోని హనుమాన్ మందిరంలో మంగళవారం నుంచి కార్తీక మాస రుద్రాభిషేకం పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 14 నుంచి వచ్చేనెల 13వ తేదీ వరకు ఆలయంలో ప్రతిరోజూ రుద్రాభిషేకం పూజలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న భక్తులు తమ పేర్లను ముందుగానే నమోదు చేసుకోవాలని సూచించారు.

# బాబ్బాబ్బూ..విత్‌డ్రా చేసుకో?!

- ఉపసంహరణలపై అందరి దృష్టి
- జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో 13 మంది నామినేషన్ల తిరస్కరణ
- 125 మంది నామినేషన్లకు ఆమోదం

సంగారెడ్డి, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ) : నామినేషన్ల ఘట్టం ముగియడంతో ప్రధాన రాజకీయపార్టీలు నామినేషన్ల ఉపసంహరణపై దృష్టి పెట్టాయి. ముఖ్యంగా కాంగ్రెస్, బీజేపీలు తమ పార్టీ నుంచి రెబెల్‌గా బరిలో దిగినవారిని పోటీ నుంచి తప్పించాలని కోరుకుంటున్నాయి. తమ పార్టీకి చెందిన నేతలు రెబెల్‌గా ఉంటే ఓట్లు చీలే ప్రమాదం ఉండడంతో పోటీ నుంచి తప్పుకోవాలని కాంగ్రెస్, బీజేపీ నాయకులు అభ్యర్థులను బుజ్జిగిస్తున్నట్లు సమాచారం. జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా 138 మంది నామినేషన్లు వేశారు. సోమవారం ఎన్నికల అధికారులు నామినేషన్లను పరిశీలించగా, 13 మంది అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించారు.

ఇదిలా ఉంటే.. కాంగ్రెస్, బీజేపీలకు అనుకూలంగా ఉన్న పలువురు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉండే నాయకులు అబ్దుల్ రహమాన్, ప్రకాశ్ రాథోడ్ నామినేషన్లు వేశారు. వీరిద్దరితో నామినేషను విత్‌డ్రా చేయించడంపై కాంగ్రెస్ నాయకులు మంతనాలు జరుపుతున్నారు. ఈ నెల 15 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉన్నది.

**13 మంది నామినేషన్లు తిరస్కరణ**

జిల్లాలో 13 మంది నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. సంగారెడ్డి,అందోలు, పటాన్‌చెరు, నారాయణఖేడ్, జహీరాబాద్ నియోజకవర్గాల్లోని రిటర్నింగ్ అధికారులు నామినేషన్లను పరిశీలించారు. జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం 138 మంది నామినేషన్లు వేశారు. ఇందులో నిబంధనలకు అనుగుణంగా ఉన్న 125 మంది నామినేషన్లకు అధికారులు ఆమోదం తెలిపి, 13 మంది నామినేషన్లను తిరస్కరించారు. సంగారెడ్డి నియోజకవర్గంలో 31 మంది నామినేషన్లు వేయగా 30 నామినేషన్లు ఆమోదించారు. బీఫాం సమర్పించని కారణంగా రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే నామినేషన్ తిరస్కరించారు. అందోలు నియోజకవర్గంలో 23 మంది నామినేషన్లు వేయగా, బీఫాం సమర్పించని త్రిష నామినేషన్ తిరస్కరించారు. జహీరాబాద్ నియోజకవర్గంలో 28 మంది నామినేషన్లు ఆమోదించగా, ఆగమ ప్రమీల, బేగరి సిద్ధన్న నామినేషన్లు తిరస్కరించారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో 20 మంది నామినేషన్లు ఆమోదించగా, బీఫాం లేని కారణంగా సురేష్ షెట్కార్, శ్రేయరెడ్డి నామినేషన్లు తిరస్కరించారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో 25 మంది నామినేషన్లు ఆమోదించారు. వేర్వేరు కారణాలతో వి.యాదగిరి, జి.సత్యనారాయణ, జి.యాదమ్మ, టి.సంధ్య, నిఖిల్‌గౌడ్, కాటా సుధ, ఎన్.నర్సింహ్మారెడ్డి నామినేషన్లు తిరస్కరించారు.